ఓల్డ్ సిటీ కాదు.. ఒరిజినల్ హైదరాబాద్

- మూసీ పరివాహక ప్రాంత అభివృద్ధికి మాస్టర్‌ప్లాన్
- ఒవైసీ హాస్పిటల్ నుంచి ఎయిర్‌పోర్ట్ వరకు మెట్రో విస్తరణ
- పదేళ్లు అధికారంలో ఉంటాం... ప్రతి గల్లీ అభివృద్ధి చేస్తాం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

సభలో మాట్లాడుతున్న సిఎం రేవంత్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
రాజకీయాలు ఎన్నికల వరకు మాత్రమే...తర్వాత అభివృద్ధి, ప్రజా సంక్షేమం పైనే మా దృష్టి అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ నగర ప్రతిష్ఠ నిలబెట్టేలా అభివృద్ధి చేసి తీరతామని స్పష్టంచేశారు. కులీకుతుబ్ షా, నిజాం నవాబు కాలంలో హైదరాబాద్ అభివృద్ధి చెందిందని, దాన్ని కొనసాగిస్తామని చెప్పారు. హైదరాబాద్ ఓల్డ్ సిటీలోని ఫరూక్‌నగర్ బస్‌డిపో సమీపంలో మెట్రో రైలు విస్తరణ పనులకు సిఎం రేవంత్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ...ఓల్డ్ సిటీ కాదు...హైదరాబాద్ ఒరిజినల్ సిటీ ఈ పాతబస్తీ అని అన్నారు. ఒరిజినల్ సిటీని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని చెప్పారు. గండిపేట నుంచి 55కిమీల మూసీ పరివాహక ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నామని చెప్పారు. ఇందుకోసం మజ్లిస్ నేత అక్బరుద్దీన్‌తో కలిసి లండన్‌లోని థేమ్స్ నగరాన్ని సందర్శించామని తెలిపారు. పేద మధ్యతరగతి ప్రజల కోసమే మెట్రో ఫేజ్ 2 తీసుకొస్తున్నామని చెప్పారు. ఒవైసి హాస్పిటల్, చాంద్రాయణ గుట్ట, మైలార్‌దేవ్‌పల్లి నుంచి ఎయిర్‌పోర్ట్ వరకు మెట్రో రైలును విస్తరిస్తామని తెలిపారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పదేళ్ళ అధికారంలో ఉంటుందని, హైదరాబాద్‌లో ప్రతి గల్లీ అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. చాంద్రాయణ గుట్టలో మెట్రో జంక్షన్ వస్తుందన్నారు. చంచల్‌గూడలో ప్రస్తుతం ఉన్న జైలును నగరం వెలుపలకు తరలించి అక్కడ పాఠశాల, కళాశాల నిర్మిస్తామన్నారు. మైనార్టీలకు విద్య, ఉద్యోగాల్లో నాలుగు శాతం రిజర్వేషన్లు అమలుచేసిన ఘనత కాంగ్రెస్‌దేనని రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. కార్యక్రమంలో హైదరాబాద్ ఎంపి అసదుద్దీన్ ఒవైసి, రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్ యాదవ్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, సిఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ వెంకట్, పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజాపాలనలో మహిళల ప్రాతినిధ్యం పెరిగింది : సిఎం రేవంత్

రాష్ట్రంలో కాంగ్రెస్ సారథ్యంలో నడుస్తున్న ప్రజాపాలనలో మహిళల ప్రాతినిధ్యం, భాగస్వామ్యం గణనీయంగా పెరిగిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సిఎం మహిళలకు శుభాకాంక్షలు తెలుపుతూ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అన్ని రంగాల్లో మహిళలు అభివృద్ధి, ప్రగతి పథంలో తీసుకెళ్లేందుకు తమ ప్రభుత్వం అవసరమైన చర్యలు చేపడుతోందన్నారు. మహిళా సాధికారతతోపాటు ఆర్థిక స్వాలంబనకు మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం, ఇంటింటికీ రూ.500 గ్యాస్ సిలిండర్ పథకాలను అమల్లోకి తెచ్చామని తెలిపారు. పురుషులతో సమానంగా మహిళలకు అవకాశాలు, హక్కులు దక్కాలని రేవంత్ ఆకాంక్షించారు. వారి అభ్యున్నతి లక్ష్యంగా రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాల ద్వారా త్వరలోనే మరిన్ని కొత్త కార్యక్రమాలను చేపడుతామన్నారు. మహిళా సంక్షేమంలో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని సిఎం ఆశాభావం వ్యక్తం చేశారు.

మైనార్టీల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం : సిఎం
తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ స్కూల్ ప్రారంభం

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల అభివృద్ధికి కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. సామాజిక అసమానతల గోడలు కూల్చడంలో విద్య కీలక పాత్ర పోషిస్తుందని నమ్ముతున్నట్టు తెలిపారు. హైదరాబాద్ గోల్కొండ ఇబ్రహీంబాగ్‌లో రూ.20 కోట్లతో నిర్మించిన మైనారిటీస్ రెసిడెన్షియల్ స్కూల్, జూనియర్ కాలేజీ శుక్రవారం ముఖ్యమంత్రి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సమాజంలో ముస్లిముల పిల్లలకు సరైన విద్య అందించడం ద్వారా మజనీయమైన మార్పునకు నాంది పలుకవచ్చునని తన విశ్వాసమన్నారు. ఇబ్రహీంబాగ్‌లో తెలంగాణ మైనారిటీ గురుకుల కళాశాల, పాఠశాల భవనాన్ని ప్రారంభించడంతో ఒక ముందడుగు వేశామన్నారు. మైనార్టీల అభ్యున్నతి కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని, అన్ని విధాలుగా వారి అభివృద్ధి కృషి చేస్తామని తెలిపారు. విద్యార్థులకు ఉన్నత నాణ్యమైన విద్య అందించేందుకు తమ ప్రభుత్వం పాటుపడుతుందన్నారు. మైనార్టీల కోసం నాలుగు శాతం రిజర్వేషన్ అమలు చేసిన ఘనత కాంగ్రెస్‌దేనని తెలిపారు.

రాష్ట్ర వ్యాప్తంగా మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలు, జూనియర్, డిగ్రీ, వృత్తి విద్యా కళాశాలలు మరిన్ని చూడాలనుకుంటున్నట్టు హైదరాబాద్ ఎంపి అసదుద్దీన్ ఒవైసి అన్నారు. హైదరాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ భవనాలను సిఎం ప్రారంభించడం సంతోషకరమన్నారు. స్థానిక ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్‌తో కలిసి 2020లో ఈ పాఠశాల, కళాశాల భవనాల నిర్మాణానికి తాను శంకుస్థాపన చేసినట్టు గుర్తు చేశారు. రూ.20 కోట్లతో జి ప్లస్ -4 అంతస్తులు, విద్యార్థులు ఆడుకోవడానికి ఖాళీ స్థలం, 28 తరగతి గదులు, కనీసం 500 మంది విద్యార్థులు ఉండేందుకు వీలుగా దీన్ని నిర్మించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపి అనిల్ కుమార్‌యాదవ్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్యేలు కౌసర్ మొహియుద్దీన్, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, జిహెచ్‌ఎంసి కమిషనర్ రొనాల్డ్ రోస్, టిఎంరీస్ సెక్రటరీ ఆయేషా మస్రత్‌జహా తదితరులు పాల్గొన్నారు.

7సీస్‌కు ఫిక్కీ ప్రతిష్టాత్మక అవార్డు

ప్రజాశక్తి - హైదరాబాద్ : ప్రముఖ గేమింగ్ సంస్థ 7సీస్ ఎంటర్‌టైన్‌మెంట్ లిమిటెడ్‌కు ఫిక్కీ నుంచి ప్రతిష్టాత్మక బెస్ట్ యానిమేటెడ్ ఫ్రేమ్స్ అవార్డు దక్కింది. ఉత్తమ భారతీయ గేమ్స్ విభాగంలో కంపెనీ అభివృద్ధి చేసిన రోలర్ కోస్టర్ రష్ 3డీ ఈ గుర్తింపు అందుకుంది. ముంబయిలో ఇటీవల జరిగిన ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫిక్కీ) కార్యక్రమంలో 7సీస్ మేనేజింగ్ డైరెక్టర్ ఎల్ మారుతీ శంకర్ ఈ అవార్డును స్వీకరించారు. రోలర్ కోస్టర్ ఇప్పటికే ఆండ్రాయిడ్‌పై 20 లక్షల పైగా డౌన్‌లోడ్లను నమోదు చేసింది. తాము రూపొందించిన అల్టిమేట్ కార్ రేసింగ్, మాస్టర్ ట్రక్ 3డీ గేమ్స్ మొబైల్, ట్యాబ్లెట్ గేమ్ విభాగాల్లో ఫైనల్‌కు చేరాయని మారుతి శంకర్ తెలిపారు. తక్కువ నిడివి గల 'గేమర్ పార్టీ' యాప్‌నకు యువత నుంచి మంచి ఆదరణ లభిస్తున్నట్టు పేర్కొన్నారు.

బంధన్ 'లాంగ్ డ్యూరేషన్ ఫండ్' ఆవిష్కరణ

హైదరాబాద్ : బంధన్ మ్యూచువల్ ఫండ్ కొత్తగా ఓపెన్ ఎండెడ్, దీర్ఘకాలిక రుణ పథకం బంధన్ లాంగ్ డ్యూరేషన్ ఫండ్‌ను ఆవిష్కరించినట్టు తెలిపింది. ఈ నూతన ఫండ్ ఆఫర్ (ఎన్‌ఎఫ్‌ఒ) మార్చి 18 వరకు అందుబాటులో ఉంటుందని తెలిపింది. ఇందులో లైసెన్స్ పొందిన మ్యూచువల్ ఫండ్ పంపిణీ దారులు, పెట్టుబడి సలహాదారులు, ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లు, నేరుగా తమ సైట్ ద్వారా పెట్టుబడులు పెట్టొచ్చని పేర్కొంది. ఈ నిధులను ఎక్కువ వ్యవధితో ప్రభుత్వ, కార్పొరేట్ బాండ్లలో పెట్టుబడిగా పెట్టనుంది.

సెంట్రల్ బ్యాంక్‌లో మహిళా దినోత్సవ వేడుకలు

గుంటూరు : అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా శుక్రవారం గుంటూరులోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ ఆఫీసులో వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రీజినల్ మేనేజర్ జయ మందపే, స్థానిక శాఖల ఉద్యోగులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళల ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి డాక్టర్ నీరెన్ రావెల వివరించారు. మహిళ సాధికారితపై అడ్వకేట్ పద్మజా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో చీఫ్ మేనేజర్ ఎం శేషగిరి రావు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

మేలో మళ్లీ స్పెక్ట్రం వేలం

- ఎనిమిది బ్యాండ్‌ల విక్రయం
- టెలికం శాఖ వెల్లడి

న్యూఢిల్లీ : మరోమారు స్పెక్ట్రం వేలానికి టెలికం శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. వచ్చే మే 20 నుంచి ఎనిమిది బ్యాండ్‌ల కోసం స్పెక్ట్రం వేలం ప్రారంభం కానుంది. ఇందులో పాల్గొనే టెలికం కంపెనీల నుంచి దరఖాస్తులను అహ్వానించనున్నట్లు డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికం (డిఒటి) శుక్రవారం తెలిపింది. వచ్చే సోమవారం నుంచే దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ప్రకటించింది. ఇందుకు ఏప్రిల్ 22న చివరి తేదీగా నిర్ణయించింది. ప్రాసెసింగ్ ఫీజు ధరను రూ.1లక్షగా నిర్ణయించింది. అన్ని రకాల బ్యాండ్లలో 10,523.15 మెగాహెర్జ్ స్పెక్ట్రమ్‌ను రూ.96,317.65 కోట్ల రిజర్వ్ ధరతో వేలం వేయడానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. గత సారి విక్రయించబడని అన్ని స్పెక్ట్రమ్‌లు మళ్లీ బిడ్డింగ్‌కు సిద్ధంగా ఉంటాయి. 800, 900, 1800, 2100, 2300, 2500, 3300 ఎంహెచ్‌జడ్, 26 జిహెచ్‌జడ్ బ్యాండ్‌లలోని ఎయిర్‌వేవ్‌లు, వాయిస్, డేటా స్పెక్ట్రమ్ అధిక భాగాన్ని కవర్ చేస్తూ అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయి. కాగా.. మే 6న బిడ్డర్ల ప్రీ క్వాలిఫికేషన్, మే 9న తుది బిడ్డర్ల జాబితాను వెల్లడించనున్నారు. మే 13, 14 తేదీల్లో మాక్ వేలం ఉంటుందని డాట్ నోటీసులో పేర్కొంది.

ఫ్రీక్వెన్సీ అసైన్‌మెంట్ తేదీ నుండి 20 సంవత్సరాల పాటు స్పెక్ట్రమ్‌ను ఉపయోగించుకునే హక్కు టెలికాం కంపెనీలకు ఉంటుంది. యూనిఫైడ్ యాక్సెస్ లైసెన్స్ (యుఎఎల్)ని కలిగి ఉన్న లేదా స్వీకరించడానికి షరతులను కలిగి ఉన్న అన్ని సంస్థలు వేలంలో పాల్గొనవచ్చు. ప్రభుత్వం జారీ చేసిన, లైసెన్స్‌లు వైర్డు, వైర్‌లెస్ టెక్నాలజీలు ఒకే బలమైన నెట్‌వర్క్‌గా కలిసి పని చేయడానికి అనుమతిస్తున్నట్లు డిఒటి పేర్కొంది. టెలికాం రంగంలోకి కొత్తగా ప్రవేశించినవారు కూడా ఒక్కో లైసెన్స్ సర్వీస్ ఏరియాకు రూ. 100 కోట్ల నికర విలువను చూపవలసి ఉంటుంది.స్పెక్ట్రం లైసెన్స్‌లను భారతీయ సంస్థలకు మాత్రమే ఇవ్వబడుతుందని స్పష్టం చేసింది. విదేశీ దరఖాస్తుదారులు దానిని పొందేందుకు భారతీయ కంపెనీని ఏర్పాటు చేయవచ్చు. విదేశీ సంస్థలు నేరుగా వేలంలో పాల్గొనడానికి, భారతీయ కంపెనీ ద్వారా లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకోవడానికి అనుమతించబడతాయి. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల కోసం ఆటోమేటిక్ మార్గంలో 100 శాతం ఈక్విటీ వాటాను కలిగి ఉంటారు. భారత్‌తో భూ సరిహద్దును పంచుకునే దేశాల నుంచి పెట్టుబడులపై ఆంక్షలు కొనసాగుతున్నాయి. ఇంతక్రితం 2022 ఆగస్టులో స్పెక్ట్రం వేలం జరిగింది. ఇందులో ముఖ్యంగా 5జిని విక్రయానికి పెట్టింది. బిడ్డింగ్‌కు పెట్టిన దానిలో 71 శాతం వేలం ద్వారా విక్రయించగా కేంద్రానికి రూ.1.5 లక్షల కోట్లు సమకూరింది.

కాలేజీ భవనంపై నుంచి దూకి విద్యార్థిని మృతి

- అనుమానాలున్నాయని తల్లిదండ్రుల ఆందోళన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
హనుమకొండ జిల్లా భీమారంలోని శివాని జూనియర్ కాలేజీలో శుక్రవారం విషాదం చోటుచేసుకుంది. ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థిని సాహిత్య...కాలేజీ భవనం పై అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నారు. ఘటనపై కాలేజీ యాజమాన్యం, కేయూ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శాయంపేట మండలం గట్లకానిపర్తి గ్రామానికి చెందిన వలుగుల సాహిత్య (16) ఎంపిసి మొదటి సంవత్సరం చదువుతున్నారు. ప్రస్తుతం పరీక్షలు నడుస్తున్నాయి. అయితే, గత నాలుగు పరీక్షలు సరిగా రాయలేదని స్నేహితుల వద్ద చెప్పి బాధపడేవారు. గురువారం రాత్రి 11 గంటల వరకు స్టడీ అవర్‌లో చదువుకున్నారు.శుక్రవారం తెల్లవారుజామున కళాశాల హాస్టల్ భవనం పై అంతస్తుకు వెళ్లి కిందకు దూకేశారు. కాలేజీ సిబ్బంది వెంటనే ఆమెను మ్యాక్స్ కేర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. కానీ, అప్పటికే మృతిచెందినట్టు డాక్టర్లు చెప్పడంతో వెంటనే తల్లిదండ్రులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.అయితే, తమ కూతురు మరణం అనుమానాస్పదంగా ఉందని, తెల్లవారుజామున బిల్డింగ్ పైనుంచి పడితే ఉదయం 10 గంటల వరకు తమకు సమాచారం ఇవ్వలేదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. మృతదేహాన్ని హుటాహుటిన ఎంజీఎంకు తరలించే అవసరం ఏమొచ్చిందని నిలదీశారు. యాజమాన్యం తమ అనుమానాలు నివృత్తి చేయాలని విద్యార్థి సంఘాల నేతలతో కలిసి కాలేజీ ఎదుట ఆందోళన చేశారు. ఘటనపై హనుమకొండ ఏసీపీ దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. విషయం తెలియగానే కేయూ సీఐ కళాశాలకు చేరుకున్నారు. సాహిత్య గదిని పరిశీలించగా సూసైడ్ నోట్ దొరికిందని చెప్పారు. గత నాలుగు పరీక్షలు సరిగా రాయలేకపోయానని, నాన్న ఆశయం నెరవేర్చలేకపోతున్నానని, అందుకే ఆత్మహత్య చేసుకుంటున్నట్టు సూసైడ్ నోట్ ఉన్నట్టు తెలిపారు. విద్యార్థిని మృతిపై పూర్తి దర్యాప్తు చేస్తామని, కాలేజీ యాజమాన్యంతో పాటు విద్యార్థిని తల్లిదండ్రులు కూడా సహకరించాలని కోరారు. కాలేజీలోని సీసీ ఫుటేజీలను పరిశీలించారు.

ఒకే గొడుగు కింద 'రియాల్టీ' అనుమతులు

- రిజిస్ట్రేషన్ విభాగాన్ని ప్రక్షాళన చేస్తాం
- ఇతర సమస్యలను పరిష్కరిస్తాం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- ఘనంగా క్రెడాయ్ ప్రాపర్టీ షో ప్రారంభం

జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో
రాష్ట్రంలోని రియల్ ఎస్టేట్ వ్యాపారుల సమస్యలను పరిష్కరించడానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్నేహపూర్వకమైందని.. ఒకే గొడుగు కింద రియాల్టీకి చెందిన అన్ని అనుమతులు పొందేలా కృషి చేస్తానని అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో క్రెడాయ్ ప్రాపర్టీ షోను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..రియాల్టీ వర్గాన్ని ఇబ్బంది పెట్టే యోచన తమ ప్రభుత్వానికి లేదన్నారు. బిల్డర్లు ఇచ్చే సూచనలను ప్రభుత్వం తప్పకుండా పరిగణలోకి తీసుకుంటుందన్నారు.

"గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణితో సామాన్య ప్రజల నుంచి రియల్ ఎస్టేట్ వర్గాల వరకు అనేక ఇబ్బందులు పడ్డారు. రెవెన్యూ వ్యవస్థలోని లొసుగులను పరిష్కరిస్తాం. అందుకోసం కసరత్తు జరుగుతుంది. ఉమ్మడి రాష్ట్రంలోని కాంగ్రెస్ కృషి వల్లే హైదరాబాద్ నగరం దేశ, విదేశాల్లో గుర్తింపు పొందింది. అప్పుడు నీటి సమస్యను పరిష్కరించడం ద్వారానే నగరం మరింత అభివృద్ధి చెందింది. ఒఆర్ఆర్, అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటు కాంగ్రెస్ చేసిన కృషి. హైదరాబాద్ అంటే సెక్యూలర్, సేఫ్ ప్లేస్ అని గుర్తింపు పొందింది. మీ రియల్ ఎస్టేట్ వ్యాపారంలో సంపాదించే ప్రతీ పైసాకు ప్రభుత్వం రక్షణ కల్పిస్తుంది. రియాల్టీ వర్గాలు కోరిన అనుమతులకు సంబంధించిన సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇస్తున్నాం. రోడ్డు సెక్టార్‌ను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయడానికి సిద్దంగా ఉన్నాం.రియాల్టీ వర్గాల అనుమతులను ఒకే గొడుగు క్రిందికి తీసుకొస్తాం. రిజిస్ట్రేషన్ విభాగాన్ని ప్రక్షాళన చేస్తాం." అని మంత్రి పొంగులేటి అన్నారు.

ప్రదర్శనకు 100 ప్రాజెక్టులు..

హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో 8 నుండి 10 మార్చి 2024 వరకు జరుగనుంది. ఈ షోలో క్రెడాయ్ సభ్యుల నుండి వంద కంటే ఎక్కువ రెరా ఆమోదించబడిన ప్రాజెక్ట్‌లను ప్రదర్శించారు. క్రెడాయ్ హైదరాబాద్ ప్రాపర్టీ షో 2024లో తమ కలల ఇంటిని ఎంచుకోవడానికి, ఉత్తమమైన డీల్‌లను పొందేందుకు అత్యుత్తమమైన 'మౌకా' గహ కొనుగోలుదారులకు లభిస్తుందని ఆ వర్గాలు తెలిపాయి. క్రెడాయ్ హైదరాబాద్ ప్రెసిడెంట్ వి.రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. "హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ రంగం పోత్సాహకరంగా ఉంది. నివాస, వాణిజ్య, రిటైల్ రియల్ ఎస్టేట్‌లో నిరంతర వృద్ధిని సాధిస్తోంది. ఫిబ్రవరిలో, రాష్ట్రం నమోదైన ఆస్తుల సంఖ్య పరంగా 21 శాతం పెరుగుదలను నమోదు చేసింది. గత ఏడాదితో పోలిస్తే నమోదైన ఆస్తుల విలువలో 42 శాతం పెరుగుదల కనిపించింది. రూ.25-50 లక్షల ధరల శ్రేణి గృహాలకు కూడా డిమాండ్ బాగుంది. సిఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన మెగా మాస్టర్ ప్లాన్ 2050 ద్వారా ఆయన దూరదృష్టి నగర అభివృద్ధికి మరింత దోహదం చేయనుంది." అని అన్నారు. "బ్రాండ్ హైదరాబాద్'ను ఉన్నతీకరించడానికి నిరంతర ప్రయత్నాలతో నగరం తాజా పెట్టుబడులను ఆకర్షిస్తుంది, మరిన్ని ఉద్యోగాలను సష్టించడం తో పాటుగా నగరంలో రియల్ ఎస్టేట్ వద్ధికి సహాయపడుతుంది..." అని రాజ శేఖర్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో క్రెడాయ్ ప్రెసిడెంట్ ఎలెక్ట్ ఎస్ జైదీప్ రెడ్డి, జనరల్ సెక్రటరీ బి జగన్నాథరావు, ప్రాపర్టీ షో కన్వీనర్ కొత్తపల్లి రాంబాబు, కార్యదర్శి వర్గ సభ్యులు బి ప్రదీప్ రెడ్డి, సి జి మురళీ మోహన్, ఎం శ్రీకాంత్, మనోజ్ కుమార్ అగర్వాల్, క్రాంతి కిరణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకు దుర్మరణం

- ఆస్పత్రికి వెళ్తుండగా ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
డయాలసిస్ చేయించుకునేందుకు ఆస్పత్రికి వెళు తుండగా.. రోడ్డు ప్రమాదం జరిగి తండ్రీకొడుకు మృతి చెందారు. ఈ సంఘటన నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండలంలోని అంక్సాపూర్ 44వ జాతీయ రహదారిపై శుక్రవారం జరిగింది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. మోర్తాడ్ మండలంలోని దొనకల్ గ్రామానికి చెందిన మాడవీడి రవీందర్ (55) కొన్ని సంవత్సరాల కిందట గల్ఫ్ నుంచి తిరిగి వచ్చారు. అనారోగ్యానికి గురవ్వడంతో డయాలసిస్ చేయించుకునేందుకు కొడుకు శివరాజ్ (24)ను వెంట తీసుకొని బైక్‌పై ఆర్మూర్ వైపు వస్తున్నారు. ఈ క్రమంలో అంక్సాపూర్ వద్ద జాతీయ రహదారిపై లారీని బైక్ ఢీకొంది. ఘటనా స్థలంలోనే తండ్రీకొడుకు మృతి చెందారు. రూరల్ సిఐ, వేల్పూర్ ఎస్ఐ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అజాగ్రత్తగా జాతీయ రహదారిపై లారీని పార్కింగ్ చేసిన డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు.

కవితది శివరాత్రి నిరాహార దీక్ష

- టిపిసిసి అధికార ప్రతినిధి కల్వ సుజాత ఎద్దేవా

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో
లిక్కర్ కేసు నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే మహిళల అంశాన్ని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఎత్తుకున్నారని టిపిసిసి అధికార ప్రతినిధి కల్వ సుజాత విమర్శించారు. మహిళల పేరుతో కల్వకుంట్ల కవిత శివరాత్రి నిరాహార దీక్ష చేస్తున్నారని ఎద్దేవా చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆమె విలేకర్లతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా పక్షపాత ప్రభుత్వమన్నారు. స్వలాభం కోసమే కవిత డ్రామాలాడుతున్నారని విమర్శించారు. రాజకీయ భవిష్యత్ కోసం బిజెపి నేత డీకే అరుణ పని చేస్తున్నారు తప్ప పాలమూరు కోసం కాదన్నారు. పాలమూరు ఎత్తిపోతల ప్రాజెక్టుకు జాతీయ హోదాను ఎందుకు తీసుకురాలేదని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు బిఆర్ఎస్‌కు ఏటిఎం అన్న బిజెపి ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు.

ఫారం నెం.యుఆర్‌సి-2

చట్టంలోని ఛాప్టర్ XXI యొక్క పార్ట్ I క్రింద రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన నోటీసు ఇవ్వవలసిన ప్రకటన
(కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 374(బి) మరియు కంపెనీల (రిజిష్టర్ చేయుటకు అధికారం ఇవ్వబడిన) రూల్స్, 2014లోని రూల్ 4(1)కు అనుగుణంగా)

1) ఇందుమూలంగా ప్రకటన ఇవ్వడమేమనగా వాటాల ద్వారా కంపెనీ లిమిటెడ్‌గా కంపెనీల చట్టం, 2013లోని ఛాప్టర్ XXI యొక్క పార్ట్ I క్రింద **"దండమూడి రియల్టర్స్"** నమోదుకాని భాగస్వామ్య సంస్థ, నమోదుకు సంబంధించి రిజిస్ట్రార్, సెంట్రల్ రిజిస్ట్రేషన్ సెంటర్ (సిఆర్‌సి), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కార్పొరేట్ అఫ్ఫైర్స్ (ఐఐసిఏ), ప్లాట్ నెం.6, 7, 8, సెక్టార్ 5, ఐఎంటి మనేసర్, జిల్లా గుర్గామ్ (హర్యానా), పిన్ కోడ్-122050 వారికి దరఖాస్తు చేయుటకు ప్రతిపాదించ బడిందని కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 366 యొక్క ఉప-సెక్షన్(2)కు అనుగుణంగా ఇందు మూలంగా తెలియజేయడమైనది.

2) కంపెనీ యొక్క ప్రధాన ఉద్దేశ్యాలు దిగువ విధంగా కలవు:
బి) పౌర నిర్మాణాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, జలవిద్యుత్‌ప్రాజెక్టుల నిర్మాణం, వంతెనలు, టెన్నెల్ మరియు వివిధ విభాగాలు, కార్పొరేషన్లు, బోర్డులు మరియు కంపెనీలకు మెటీరియల్‌ల సరఫరా మరియు ఎప్పటికప్పుడు పరస్పరం అంగీకరించిన వ్యాపారాన్ని కొనసాగి ంచడం, వ్యాపారం భారతదేశంలో లేదా మరేదైనా ఇతర ప్రదేశంలో ఎప్పటికప్పుడు పరస్పరం నిర్ణయించుకునే విధంగా నిర్వహించబడుతుంది మరియు SRN: AA6994346 తేది.3 మార్చ్, 2024 ఆధారంగా సిఆర్‌సితో దాఖలుచేసిన పేరు దరఖాస్తులో పేర్కొన్న ఇతర వస్తువుల వ్యాపారం నిర్వహించుటకు

3) ప్రతిపాదిత కంపెనీ యొక్క డ్రాఫ్ట్ మెమొరాండం మరియు ఆర్టికల్స్ అఫ్‌అసోసియేషన్ యొక్క ముసాయిదా ప్రతిని రిజిష్టర్డు ఆఫీసు: ప్లాట్ నెం.99 & 100, గ్రీన్ పార్క్‌అవెన్యూ, మేడ్చల్‌రోడ్, సికింద్రా బాద్-500054, తెలంగాణ, ఇండియా వద్ద పరిశీలించుకోవచ్చును.

4) ఇందుమూలంగా ప్రకటన ఇవ్వడమేమనగా ఈ దరఖాస్తును వ్యతిరేకించదలచిన ఏ వ్యక్తి అయినా వారి అభ్యంతరాలను కంపెనీకి దీని రిజిష్టర్డు ఆఫీసులో ఒక కాపీతో ఈ ప్రకటన ప్రచురించిన తేదీ నుండి ఇరవై ఒక రోజుల్లోపు రిజిస్ట్రార్, సెంట్రల్ రిజిస్ట్రేషన్ సెంటర్(సిఆర్‌సి),ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కార్పొరేట్ అఫ్ఫైర్స్(ఐఐసిఏ), ప్లాట్ నెం.6, 7, 8, సెక్టార్ 5, ఐఎంటి మనేసర్, జిల్లా గుర్గామ్ (హర్యానా), పిన్‌కోడ్-122050 వారికి వ్రాత పూర్వకంగా తెలియజేయవలెను.

దండమూడి రియల్టర్స్ కొరకు
సం/-
డి.అవనీంద్ర కుమార్
ప్రతిపాదిత డైరెక్టర్
తేది:07.03.2024
ప్రదేశం: హైదరాబాద్

బాష్ నుంచి కొత్త రిఫ్రిజిరేటర్లు

న్యూఢిల్లీ : గృహోపకరణాల తయారీదారు బాష్ హోమ్ అప్లయిన్సెస్ కొత్తగా సింగిల్ డోర్ రిఫ్రిజిరేటర్లను ఆవిష్కరించినట్లు తెలిపింది. ఇవి 187 లీటర్లు, 226 లీటర్ల వరకు సామర్థ్యాలను కలిగి ఉంటాయని పేర్కొంది. ఇవి 18 గంటల పాటు శీతలీకరణను అందిస్తాయని తెలిపింది. 10 ఏళ్ల కంప్రెసర్ వారంటీతో అందుబాటులోకి తెచ్చినట్లు బిఎస్‌హెచ్ గృహోపకరణాల ఎండి, సిఇఒ సైఫ్ ఖాన్ తెలిపారు. కాగా.. వీటి ధరలను ఆ సంస్థ వెల్లడించలేదు.

ఎయిర్‌టెల్ ఆఫర్లతో పోకో ఎం6 5జి

న్యూఢిల్లీ : స్మార్ట్‌ఫోన్ల తయారీ సంస్థ పోకో కొత్తగా బడ్జెట్ ధరలో కొత్త పోకో ఎం6 5జిని విడుదల చేసింది. దీన్ని ప్రత్యేకంగా భారతీ ఎయిర్‌టెల్ ఆఫర్లతో అందిస్తున్నట్లు పేర్కొంది. ఫ్లిప్‌కార్ట్‌లో మార్చి 10 నుంచి రూ.8,799కి అందుబాటులో ఉంటుందని వెల్లడించింది. 4జిబి-128జిబి, 6జిబి-128 జిబి, 8జిబి-256 జిబి వేరియంట్లలో దీన్ని ఆవిష్కరించింది. 5000 ఎంఎహెచ్ బ్యాటరీ, వెనుక వైపు 50 ఎంపి కెమెరా, సెల్ఫీ కోసం 5 ఎంపి కెమెరాను అమర్చింది.

హరీశ్‌రావు వ్యాఖ్యలకు టిఎస్‌పిటిఎ ఖండన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
ఎసిల్లో ఉండే ఉద్యోగులకు నెలలో మొదటి రోజు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం జీతాలు చెల్లించిందన్న మాజీ మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యలను టిఎస్‌పిటిఎ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ షౌకత్‌అలీ, జాతీయ కౌన్సిల్ సభ్యులు నాగనమోని చెన్నరాములు ఎన్ ఆశాకుమారి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆర్థిక మంత్రిగా పనిచేసిన హరీశ్‌రావుకు ఉద్యోగులకు మొదటి తేదీన జీతాలు చెల్లించాలన్న నిబంధనలున్నాయని తెలియదా?అని ప్రశ్నించారు. పదేండ్లపాటు బిఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగుల పట్ల నిరంకుశంగా వ్యవహరించిందని విమర్శించారు. న్యాయబద్ధంగా సకాలంలో జీతభత్యాలను చెల్లించలేదని తెలిపారు. జీతాలపైనే ఆధారపడ్డ ఉద్యోగులు ఎన్నో ఇబ్బందులు పడ్డారని పేర్కొన్నారు.

నకిలీ పత్రాలతో భూమి ఆక్రమణ

- గజ్వేల్ తహసీల్దార్‌తో సహా మరో ఇద్దరు అరెస్టు
- పరారీలో తొమ్మిది మంది

ఆక్రమణకు గురైన స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
నకిలీ ధృవపత్రాన్ని సృష్టించి ఓ భూమిని ఆక్రమించినందుకు కొత్తపల్లి మాజీ తహసీల్దార్ (ప్రస్తుత గజ్వేల్ తహసీల్దార్) చిల్ల శ్రీనివాస్‌ను గురువారం కరీంనగర్ పోలీసులు అరెస్టు చేశారు. చిల్ల శ్రీనివాస్‌తో పాటు అతనికి సహకరించినవారిపై కరీంనగర్ సీతారాంపూర్‌కు చెందిన బొంతల రఘు రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌లో 12 మందిపై కేసు నమోదు కాగా వారిలో ముగ్గురుని అదుపులోకి తీసుకున్నారు.. మరో తొమ్మిదిమంది పరారీలో ఉన్నారు. అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించిన ముగ్గురిలో గజ్వేల్ తహసీల్దార్ చిల్ల శ్రీనివాస్ (ఎ వన్), అతని బినామీ అయిన చంద సంతోష్ (గోదావరిఖని, కల్యాణ్ నగర్), కొత్తపల్లి ఎమ్మార్వో ఆఫీసులో విఆర్‌ఎగా పని చేసి ప్రస్తుతం తూంకుంట మున్సిపల్ ఆఫీస్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న పల్లె జీవన్ (ఎ టూ) ఉన్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

కరీంనగర్ సీతారాంపూర్‌కు చెందిన బొంతల రఘు.. తాత ఐలయ్యకు చెందిన ఆరేపల్లి, రేకుర్తిల్లోని 3.250 ఎకరాల భూమిని తన తండ్రి రాజుకు, చిన్నాన్నకి 2012లో సమాన భాగాలుగా పంచి రిజిస్ట్రేషన్లు చేయించారు. ఆరేపల్లిలోని భూమి సక్రమంగా రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేయడంతో పాటు ఆన్‌లైన్‌లోనూ చూపెడుతోంది. కానీ రేకుర్తికి చెందిన సర్వేనెంబర్ 29 లోని భూమి మాత్రం రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ అయినా ఆన్‌లైన్‌లో మాత్రం చూపించడం లేదు. ఈ విషయమై అప్పుడున్న కొత్తపల్లి తహసీల్దార్ చిల్ల శ్రీనివాస్‌ను రఘు సంప్రదించారు. సమస్య పరిష్కరించేందుకు.. లంచంగా ఆ భూమి నుంచి 30 గుంటల భూమిని తహసీల్దార్ పేరిట రిజిస్ట్రేషన్ చేయించాలని డిమాండ్ చేయగా.. దానికి రాజు ఒప్పుకోలేదు. ఐలయ్య 2015లో చనిపోయారు. 2016లో బాధితుని నానమ్మ పేరిట ఐలయ్య రిజిస్ట్రేషన్ చేసినట్టుగా సదరు తహసీల్దార్ నకిలీ డాక్యుమెంట్స్ సృష్టించాడు. బాధితుని బంధువులతో కుమ్మక్కయ్యి నాన్నమ్మ నుంచి అదే ఆఫీసులో ధరణి ఆపరేటర్‌గా పనిచేస్తున్న అప్పటి విఆర్‌ఎ పల్లె జీవన్ సహాయంతో, 2022 ఆగస్టులో బాధితుడి చిన్నాన్న, తన నలుగురి మేనత్తల పేరిట ఒక్కొక్కరికి నాలుగున్నర గుంటలు, ఎమ్మార్వో బినామీ అయిన గోదావరిఖని కల్యాణ్ నగర్‌కు చెందిన చందా సంతోష్ పేరిట 30 గుంటల భూమిని మార్చినట్టు బాధితుడు తన ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టగా విచారణలో బాధితులు తెలిపిన వివరాలు నిజమేనని తేలడంతో ఈ ఘటనలో నిందితులైన 12 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇందులో గజ్వేల్ తహసీల్దార్ శ్రీనివాస్, చంద సంతోష్, బొంతల రవి, బొంతల లావణ్య, ఉప్పుల కనక లక్ష్మి, దాడి రాధ, చుప్ప మంజుల, చిలువేరు స్వప్న, చిలువేరు మల్లేశం, పల్లె జీవన్, వినోద్, బుచ్చిరాజుపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. వీరిలో తొమ్మిది మంది పరారీలో ఉండగా, ముగ్గురిని అదుపులోకి తీసుకొని శుక్రవారం కోర్టులో హాజరుపరిచారు. కేసును పూర్తిగా పరిశీలించిన అనంతరం మెజిస్ట్రేట్ నిందితులకు 14 రోజుల రిమాండ్ విధించగా కొత్తపల్లి పోలీసులు ముగ్గురు నిందితులను కరీంనగర్ జైలుకు తరలించారు.

జీతాలు పడ్తాలే..!

- ఐదు నెలలుగా పంచాయతీ కార్మికుల ఎదురుచూపు
- రాష్ట్రంలో 60 వేల మంది పారిశుధ్య కార్మికులు
- పెండింగ్‌లో రూ.200 కోట్లు
- వెంటనే వేతనాలు చెల్లించాలని కార్మికుల డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కోడి కూయక ముందే పల్లె వీధులను శుభ్రం చేసి.. పరిశుభ్రంగా మార్చే పారిశుధ్య కార్మికుల బతుకులు మసకబారుతున్నాయి. వీరి శ్రమతో గ్రామాల్లో వెలుగులు విరజిమ్ముతున్నా.. కార్మికులు జీవితాలు ఆర్థిక కష్టాల్లో కూరుకుపోతున్నారు. గ్రామాల్లో పారిశుధ్య కార్మికులకు ఐదు నెలలుగా వేతనాలు అందడం లేదు. అసలే వారికి వచ్చేది అరకొర వేతనం.. అది కూడా సకాలంలో అందకపోవడంతో ఆ కుటుంబాలు అర్థాకలితో అలమటిస్తున్నాయి. పస్తులుండి పనిచేస్తున్నా ప్రభుత్వం తమ పట్ల కనికరం చూపడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమకు వెంటనే పెండింగ్ వేతనాలు చెల్లించాలని పారిశుధ్య కార్మికులు కోరుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 12,769 గ్రామ పంచాయతీల పరిధిలో సుమారు 60 వేల మంది పంచాయతీ కార్మికులు పని చేస్తున్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం 52 వేల మంది ఉన్నారు. వీరికి నాలుగు నెలలుగా వేతనాలు అందడం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు రూ. 200 కోట్ల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి.

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఆరు వేల మంది పంచాయతీ కార్మికులు పని చేస్తున్నారు. రంగారెడ్డి జిల్లాలో 3,600 మంది, వికారాబాద్‌లో 2,500 మంది కార్మికులు ఉన్నారు. ఒక్కో గ్రామ పంచాయతీలో ఐదు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో రూ.20 కోట్లు పెండింగ్ ఉన్నట్టు సమాచారం. రంగారెడ్డి జిల్లా యాచారం మండల పరిధిలోని నల్లవెల్లి గ్రామ పంచాయతీలో సుమారు ఐదు వేల మంది జనాభా ఉంటుంది. ఈ గ్రామంలో 14 మంది పారిశుధ్య కార్మికులు ఉన్నారు. వీరిలో ఐదుగురికి మాత్రమే ప్రభుత్వం అందించే రూ.9,500 వేతనం అందుతోంది. ఈ ఐదుగురి వేతనం రూ.42,500 రాగా, అందులో నుంచి ఒక్కో సుమారు రూ.మూడు వేల చొప్పున 14మంది కార్మికులు పంచుకుంటున్నారు. అరకొర వేతనంతో కుటుంబ పోషణ భారంగా మారుతోందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వచ్చే అరకొర వేతనం కూడా ఐదు నెలలుగా అందడం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది.

రెండు పూటలు పనిచేయాల్సిందే..

కార్మికులు కుటుంబ పోషణ కోసం ఇతర పనులు చేసుకుద్దామంటే ప్రభుత్వం తీసుకొచ్చిన నిబంధనలు అడ్డువస్తున్నాయి. ప్రతిరోజూ కార్మికులు రెండు పూటలా పనిచేయాల్సి వస్తోంది. జీయో ట్యాగింగ్, యాప్‌ల పేరుతో రోజుకు రెండు సార్లు పని ప్రదేశంలో ఫొటోలు తీసి పంపించాలని అధికారుల నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. దాంతో కార్మికులు ఇతర పనులకు వెళ్లలేకపోతున్నారు. ఇతర పనులు చేసుకోలేక, చేసే పనికి జీతం రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమకు వెంటనే వేతనాలు చెల్లించాలని కోరుతున్నారు.

పస్తులుండి పనిచేస్తున్నాం
పెంటయ్య, నల్లవెల్లి గ్రామ పంచాయతీ

నల్లవెల్లి గ్రామ పంచాయతీ కారోబార్‌గా పనిచేస్తున్నా. ఐదు నెలలుగా జీతం లేదు. ఇల్లు గడవడం కష్టంగా ఉంది. ఏమైనా ఇతర పని చేసుకుందామంటే ఎప్పుడు ఏ అధికారి వచ్చి ఫోన్ చేస్తాడో తెలియదు. ఇంట్లో పిల్లలకు సరైన తిండి పెట్టలేని దీనస్థితిలో బతుకుతున్నాం. ప్రభుత్వం కనికరించి సకాలంలో వేతనాలు చెల్లించాలి.

కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలి
తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు గ్యార పాండు

అరకొరగా ఇచ్చే వేతనాలను కూడా పెండింగ్‌లో పెట్టడంతో పంచాయతీ కార్మికుల బతుకులు రోడ్డున పడుతున్నాయి. కుటుంబం గడవని పరిస్థితి ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా ఒక్కో గ్రామ పంచాయతీ పరిధిలో సుమారు 5 నుంచి 6 నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రభుత్వం తక్షణమే స్పందించి పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి.

మహిళా రక్షణకు ఆప్ చర్యలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆమ్ ఆద్మీ పార్టీ పాలిత రాష్ట్రాల్లో మహిళల రక్షణకు అధిక ప్రాధాన్యమిస్తున్నదని ఆ పార్టీ మహిళా నాయకులు తెలిపారు. శుక్రవారం ఆప్ రాష్ట్ర కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, బస్సుల్లో మార్షల్స్ ఏర్పాటు, మహిళలకు రక్షణకు లక్షలాది సిసి కెమెరాల ఏర్పాటు వంటి చర్యలను తీసుకుందని గుర్తుచేశారు. రాష్ట్రంలోనూ అలాంటి చర్యలు చేపట్టాలని వారు సూచించారు. ఈ వేడుకల్లో ఆప్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్, ఆప్ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు హేమ జిల్లోజు, ప్రధాన కార్యదర్శి యమున గౌడ్, డాక్టర్ల విభాగం నాయకురాలు డాక్టర్ లాక్షానాయుడు తదితరులు పాల్గొన్నారు.

కెటిఆర్‌కు మద్రాస్ ఐఐటి ఆహ్వానం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అంత్రపెన్యూరల్ ఫెస్టివల్‌లో ప్రసంగించేందుకు తమ సంస్థకు రావాలని మాజీ మంత్రి, బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు కె తారకరామారావుకు ఐఐటి మద్రాస్ ఆహ్వానం పలికింది. ఈ మేరకు శుక్రవారం కెటిఆర్‌కు ఆహ్వానపత్రికను పంపింది. ప్రతి ఏటా నిర్వహించే ఇ- సమ్మిట్‌కు దేశ విదేశాల నుంచి అంత్రపెన్యూరల్ రంగంలో కీలకమైన వ్యక్తులను, సంస్థల అధిపతులను, పాలసీ మేకర్లను, ప్రముఖ వ్యక్తులను ఐఐటీ మద్రాసు ఆహ్వానిస్తోంది. దేశంలోనే అంతర్జాతీయ గుర్తింపు ఐఎస్ఓ సర్టిఫికేషన్ కలిగిన ఏకైక కార్యక్రమం ఇది. ఈసారి సమ్మిట్‌కు కేంద్రమంత్రి పీయూష్ గోయల్, ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుల్లో ఒకరైన క్రిస్ గోపాల కృష్ణన్, హెచ్‌సిఎల్ సహ వ్యవస్థాపకులు అజయ్ చౌదరి హాజరుకానున్నారు.

దుర్గాదేవికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి

ఏడుపాయల్లో జన జాతర

- పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే, కలెక్టర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్రంలోనే అత్యంత ప్రసిద్ధి చెందిన ఏడుపాయల వన దుర్గమాత ఆలయంలో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఏడుపాయల జాతర మహోత్సవాలు అత్యంత ఘనంగా కన్నుల పండువగా శుక్రవారం ప్రారంభమయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతినిధిగా మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు దంపతులు, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ దంపతులు హాజరై అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. దుర్గాదేవి ఆలయంలో మంగళ వాయిద్యం, అమ్మవారికి అభిషేకం, సుప్రభాత సేవ విశేష పూజలు నిర్వహించి ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. ఆలయ గర్భాలయంలో అర్చకులు ఆర్ శంకర్ శర్మ, పార్థీవ శర్మ, రాజశేఖర్, మురళీధర్, రాము శర్మ, ఉదయం అభిషేకం తదితర పూజలు నిర్వహించి, పట్టు వస్త్రాలను దుర్గా దేవి అమ్మవారికి ధరించి, వివిధ రకాల పూలతో అత్యంత సుందరంగా అలంకరించారు. అమ్మవారికి బంగారు కిరీటం, మెడలో వజ్ర వైఢూర్యాలతో తయారుచేసిన ముత్యాలహారం, ఇతరత్ర నగలు అమ్మవారికి ధరించారు. కలెక్టర్ రాహుల్ రాజ్, చైర్మన్ బాలా గౌడ్, ఇఒ మోహన్ రెడ్డి జాతరను నిరంతరం పర్యవేక్షించారు.

లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న మంత్రి శ్రీధర్ బాబు

భూ నిర్వాసితులకు ఇంటి స్థలాల పట్టాల పంపిణీ

- సింగరేణికి భూములిచ్చిన వారికి కృతజ్ఞతలు
- మంత్రి శ్రీధర్‌బాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పెద్దపల్లి జిల్లా రామగిరి మండలంలోని అక్కెపల్లి గ్రామానికి చెందిన కొంత మంది భూ నిర్వాసితులకు ఇళ్ల స్థలాల పట్టాలను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రం, దేశ విద్యుత్ అవసరాల దృష్ట్యా విద్యుత్ ఉత్పత్తికి కావాల్సిన బొగ్గు వెలికితీత కోసం సింగరేణి సంస్థ చేపట్టిన భూ సేకరణకు తమ భూములు ఇచ్చి సహకరించిన అక్కెపల్లి, రచ్చపల్లి గ్రామ భూనిర్వాసితులకు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా, సింగరేణి సంస్థ యాజమాన్యం భూ నిర్వాసితులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని, వారికి ఎలాంటి ఇబ్బంది కాకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ టి జీవన్ రెడ్డి, డైరెక్టర్ (ఆపరేషన్స్, పర్సనల్) ఎన్‌వికె శ్రీనివాస్, జిఎం (ఎస్టేట్స్) ఎస్‌డిఎస్ సుభాని, రామగుండం-3 ఏరియాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అర్జీ-3 జిఎం ఎన్ సుధాకరరావు, ఎపిఎ జీఎం కె వెంకటేశ్వర్లు, అర్జీ-2 జిఎం ఎల్‌వి సూర్య నారాయణ పాల్గొన్నారు.

త్వరలో వడ్డీలేని రుణాలు

- ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక కృషి
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో త్వరలో మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందిస్తామని రోడ్డు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. మహాశివరాత్రి సందర్భంగా శుక్రవారం నల్లగొండ పట్టణంలోని పానగల్‌లో చారిత్రాత్మక పచ్చల, చాయా సోమేశ్వరాలయాలను సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళా సంక్షేమం కోసం ఎన్నో పథకాలను అమలు చేశామన్నారు. మహిళల ఆర్థిక అభివృద్ధికి అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటామన్నారు. మహిళలకు వడ్డీలేని రుణాలు ఇస్తామని చెప్పారు. పానగల్ ఆలయాలకు ఎంతో ప్రత్యేకత ఉందని ఈ ఆలయాల అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని తెలిపారు. ఈ పర్యటనలో నల్లగొండ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బుగోని రమేష్ గౌడ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి, కౌన్సిలర్లు ఉన్నారు.

ఆర్థిక చేయూతకు సహాయం

- ఎమ్మెల్యే హరీశ్ రావు
- సోదరీమణులకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు
- కుట్టు మిషన్లు పంపిణీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆర్థికంగా చేయూతనందించాలన్న ఉద్దేశంతో ఉడుతా భక్తి సాయంగా మహిళలకు కుట్టు మిషన్లు అందజేస్తున్నానని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. బాబూ జగజ్జీవన్ భవన్‌లో సిద్దిపేట అర్బన్, నంగునూర్, నారాయణరావుపేట మండలాల్లోని వివిధ గ్రామాల్లో కుట్టు శిక్షణ పొందిన మహిళలకు శుక్రవారం ఉచితంగా కుట్టు మిషన్లను ఎమ్మెల్యే హరీశ్‌రావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సోదరీమణులకు శుభాకాంక్షలు తెలిపారు. సిద్దిపేట ప్రజల ప్రేమ తనకు బలం, శక్తి అని, సిద్దిపేటను అన్ని రంగాల్లోనూ ఆదర్శంగా నిలిపామన్నారు. మహిళలు తమ స్వంత కాళ్లపై నిలబడాలన్న తపనతో నంగునూర్, సిద్దిపేట రూరల్, అర్బన్, చిన్నకోడూరు, నారాయణరావు పేట మండలాల్లోని వివిధ గ్రామాల్లో ఆరు నెలల నుంచి రెండు బ్యాచ్‌లుగా సుమారు 2200 మందికి ఉచితంగా కుట్టు శిక్షణ ఇచ్చామని తెలిపారు. శిక్షణ పొందిన అందరికీ ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ చేసినట్టు చెప్పారు. మహిళల కోసం కల్యాణ లక్ష్మీ, షాది ముబారక్, ఆరోగ్య మహిళ, ఆరోగ్యలక్ష్మి పథకాల ద్వారా వారికి అండగా నిలిచామన్నారు. గర్భిణులకు, బాలింతలకు, శిశువులకు ప్రతి రోజు పాలు, గుడ్లతో కూడిన పోషకాహారాన్ని గతంలో తమ ప్రభుత్వం అందించినట్టు తెలిపారు. గర్భిణులు ఆస్పత్రులకు వచ్చిపోవడానికి అమ్మఒడి వాహనాల ద్వారా ఉచిత రవాణా సదుపాయాన్ని కల్పించామని, కెసిఆర్ కిట్స్‌తో ఆర్థికంగా సాయం అందించామని తెలిపారు. భరోసా సెంటర్ ఏర్పాటు, స్నేహిత, సఖి సెంటర్, బుతు ప్రేమ, రూ.5 కోట్లతో మహిళా భవనం, మెడికల్ కళాశాల, నర్సింగ్ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాలలు ఇలా ఎన్నో ఏర్పాటు చేసుకున్నామన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికి వదిలేసిందని, అనాలోచితంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. గత ఎండాకాలం కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయించి చెరువుల్ని, కుంటల్ని, చెక్ డ్యామ్‌లను నింపామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయమే ప్రధానంగా కాళేశ్వరం ప్రాజెక్టుపై తప్పుడు ప్రచారం చేస్తూ నీళ్ల విడవడం లేదన్నారు. నీళ్ల అందక రైతులు కష్టాలు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ తాను అండగా ఉంటానని ప్రజలకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వివిధ మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

మహిళలకు కుట్టుమిషన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

ఎస్‌బిఐలో మహిళా దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - హైదరాబాద్

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) లోకల్ హెడ్ ఆఫీసు హైదరాబాద్‌లో అంతర్జాతీయ మహిళ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో రాణించిన మహిళలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఐ-ఎంఎస్ఎంఇ హైదరాబాద్ డైరెక్టర్ జనరల్ సుంచు గ్లోరి స్వరూప, పైలట్ పరుల్ భరద్వాజ్, మెడికల్ అంకాలజీ డాక్టర్ సుధా సిన్హా, సామాజిక కార్యకర్త పొట్లబతిని పద్మావతి, ఎస్‌బిఐ లేడిస్ క్లబ్ ప్రెసిడెంట్ రష్మీ సిన్హా తదితరులను సత్కరించారు. కేర్ హాస్పిటల్ సహకారంతో మహిళ సిబ్బంది, హౌజ్ కీపింగ్ వారి కోసం ఉచిత మెగా హెల్త్ క్యాంప్‌ను ఏర్పాటు చేశారు. వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలను ఎస్‌బిఐ సిజిఎం రాజేష్ కుమార్ అభినందించారు. మహిళలు అనేక రంగాల్లో స్ఫూర్తిగా ఉన్నారన్నారు.

అనుమతి లేకుండా వైద్య పరికరాల అమ్మకాలు

- స్వాధీనం చేసుకున్న డిసిఎ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

లైసెన్స్ లేకుండా ఆరోగ్య సంబంధమైన పరికరాలు, ఔషధాలు అమ్మకం జరపవద్దని డిసిఎ హెచ్చరిస్తున్నా...ఇంకా చట్టవిరుద్ధంగా వ్యాపారం చేస్తున్న వారు పట్టుబడుతూనే ఉన్నారు. తాజాగా సికింద్రా బాద్ తార్నాకలో నెబ్యూలైజర్, స్టీం స్టెరిలైజర్స్ పేర్లతో రూ.6.5 లక్షల అనుమతి లేకుండా నిల్వ ఉన్న వైద్య పరికరాలను డ్రగ్ కంట్రోల్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఎంఎస్ మెడికల్ సిస్టమ్స్ పేరుతో వీటిని నిల్వ ఉంచినట్టు గుర్తించారు. అదే విధంగా సూర్యాపేట జిల్లా మఠంపల్లి గ్రామంలో చట్టవిరుద్ధంగా రూ. 20,414 విలువైన 10 రకాల ఔషధాలను స్వాధీనం చేసుకున్నారు. రమావత్ రవీంద్ర నాయక్ వీటిని నిల్వ ఉంచుతున్నట్టు గుర్తించారు.

రెండు నెలలుగా తాగునీటి తిప్పలు

- ఖాళీ బిందెలతో మహిళల నిరసన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జయశంకర్-భూపాలపల్లి జిల్లా గణపురం మండలంలోని సీతారాంపురం గ్రామ ప్రజలు గత రెండు నెలలుగా మంచినీటి కోసం తండ్లాడుతున్నారు. పాలకులు, అధికారులకు విన్నవించినా పట్టించుకోకపోవడంతో శుక్రవారం మహిళలు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ.. సీతారాంపురం గ్రామంలోని మన్నెపు కాలనీలో దాదాపు 50 ఇండ్లు ఉంటాయని, కాలనీకి గత ప్రభుత్వ ఒక బోరు వేయిస్తే.. తామే పైప్ లైన్ వేసుకున్నామని తెలిపారు. రెండ నెలల కిందట బోరు మోటార్ కాలిపోతే తామే మరమ్మతు చేయించుకున్నామన్నారు. ప్రస్తుతం మోటార్ మళ్లీ కాలిపోయిందని, కొత్త మోటార్ ఏర్పాటు చేయడంలో అధికారులు, పాలకులు పట్టించుకోవట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో నాయకులు వచ్చి కొత్త మోటార్ బిగిస్తామని హామీలిచ్చి విస్మరించారని అన్నారు. అప్పటి ప్రభుత్వం గ్రామాలకు మంచినీటిని అందించేందుకు మిషన్ భగీరథ పైప్ లైన్ వేసినా.. చుక్క నీరు రావడం లేదని తెలిపారు. ప్రతి కాలనీకి మిషన్ భగీరథ పైప్ లైన్ వేసి నల్లాలు బిగించినా నీటి సరఫరా చేయట్లేదన్నారు. అధికారులు, పాలకులు స్పందించి మంచినీటి కష్టాలను తీర్చాలని విజ్ఞప్తి చేశారు.

ఖాళీ బిందెలతో ఆందోళన చేస్తున్న మహిళలు

అవగాహన లేకుండానే ఎలివేటర్ శంకుస్థాపన

- బిఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అవగాహన లేకుండానే కంటోన్మెంట్ పరిధిలో డబుల్ డెక్కర్ కారిడార్‌ను కాదని, ఎలివేటెడ్ కారిడార్ కోసం సిఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారని బిఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ విమర్శించారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేవలం లోక్‌సభ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే రేవంత్ రెడ్డి ఎత్తుగడ వేశారని తెలిపారు. మాజీ సిఎం కెసిఆర్ ఎన్నో ప్రయత్నాల ఫలితంగా కేంద్ర రక్షణ శాఖ భూములు ఇవ్వడానికి అంగీకరించిందని గుర్తు చేశారు. కంటోన్మెంట్ భూముల విషయంలో చిక్కులు విప్పేందుకు మాజీ మంత్రి కెటిఆర్ కేంద్రంలో మంత్రులు సుష్మ స్వరాజ్ నిర్మల్ సీతారామన్, రాజనాథ్ సింగ్ తదితరులను కలిశారని తెలిపారు. దీంతో కేంద్రం గతేడాది ఆగస్టు 23న రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించేందుకు అంగీకరించిందని చెప్పారు. ఈ విషయంపై కంటోన్మెంట్ బోర్డు నిర్వహించిన సమావేశానికి స్థానిక ఎంపీగా రేవంత్ రెడ్డి హాజరు కాలేదని విమర్శించారు.

జిఒ 3 రద్దు చేయాలి

- ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు న్యాయమైన వాటా ఇవ్వాలి
- ఇందిరా పార్కు వద్ద ధర్నాలో ఎమ్మెల్సీ కవిత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు దక్కాల్సిన వాటా వారికి దక్కాల్సిందే..అందుకు ఆటంకంగా ఉన్న జీవో 3ను వెంటనే రద్దు చేయాలని భారత్ జాగృతి అధ్యక్షులు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు ధర్నా చౌక్ దగ్గర భారత్‌జాగృతి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగులకు ఇచ్చిన మాట తప్పారని చెప్పారు. కోర్టు తీర్పు పేరుతో ఆయన తప్పించుకున్నారన్నారు. జీవో 3 నిజమైతే 30వేల ఉద్యోగాల్లో ఎంత రిజర్వేషన్లు అమలు చేశారో చెప్పాలని ప్రశ్నించారు. నిరుద్యోగులు గందరగోళంలో ఉన్నారన్నారు. వారికి కాంగ్రెస్ ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళలతో పెట్టుకున్న వారు ఎవరు బాగుపడరనీ, తమ పోరాటం మహిళలకు న్యాయం కోసమేగానీ పురుషులకు అన్యాయం చేయాలని కాదన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సం రోజు ధర్నా చేయాల్సి రావటం సిగ్గుచేటని విమర్శించారు. సంతోషంగా సంబురాలు చేసుకునే ఉమెన్స్ డే రోజున ఆడబిడ్డల ఉద్యోగాలకై ధర్నాలు చేసే దౌర్భాగ్యపు స్థితిని ఈ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. బాబా సాహెబ్ అంబేద్కర్ మహిళలకు అనేక హక్కులు కల్పించారని చెప్పారు. తెలంగాణ వచ్చిన తర్వాత 33 శాతం రిజర్వేషన్‌ను పెంచుకున్నామన్నారు. గతంలో వ్యక్తిగతంగా చనిపోయిన ఆడబిడ్డలను అడ్డుపెట్టుకుని రేవంత్ రెడ్డి రాజకీయం చేశాడని విమర్శించారు. ఓటుకు నోటు కేసులో దొరికిన వ్యక్తి మహిళల ఉద్యోగాల విషయంలో కోత విధించారని విమర్శించారు. వికలాంగులు, మహిళలకు తోడు ఉండకుండా ఎవరికి తోడు ఉంటున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళలను కాస్త ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారని చెప్పారు. ఆడబిడ్డలకు అన్యాయం జరిగే ఏ ఒక్క కార్యక్రమం బీఆర్ఎస్ చేయలేదని వెల్లడించారు. అదే కాంగ్రెస్ ప్రభుత్వం ఆడపిల్లలకు వ్యతిరేకంగా జీవో 3 తెచ్చిందని విమర్శించారు. ఈ జీవో వల్ల ఉద్యోగాల్లో అమ్మాయిలకు అన్యాయం జరుగుతున్నదని చెప్పారు. ప్రభుత్వం వెంటనే ఈ జీవోను రద్దుచేసి, హైకోర్టులో పిటిషన్ వేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా వ్యతిరేక విధానాలతో ముందుకువెళ్తున్నదని చెప్పారు. ప్రజలకు వ్యతిరేకంగా ఏ నిర్ణయం తీసుకున్నా నిలదీస్తామని స్పష్టం చేశారు. జీవో 3 వల్ల గురుకులాల్లో మహిళలకు 12 శాతం ఉద్యోగాలే వచ్చాయన్నారు. తనకే అన్ని చట్టాలు తెలుసన్నట్టు సీఎం వ్యవహరిస్తారని చెప్పారు. తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాల్సిన చోట రాజీవ్ గాంధీ విగ్రహం పెడుతున్నారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి ఇలా చేస్తే..మూన్నెళ్ల ముఖ్యమంత్రిగానే ఉంటారనీ, ఆయన రేసుగుర్రంకాదనీ గుడ్డి గుర్రమని విమర్శించారు.

కబ్జా భూములను తిరిగిస్తే పార్టీలోకి ఆహ్వానం

- 100 ఎకరాలు కబ్జా చేసిన మాజీ మంత్రి మల్లారెడ్డి
- హైకోర్టు ఆదేశాల మేరకే అక్రమ కట్టడాల కూల్చివేత
- మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మాజీ మంత్రి మల్లారెడ్డి 100 ఎకరాలు స్వాహా చేశారని, ఆ భూములన్నీ ప్రభుత్వానికి అప్పగిస్తే తామే దండ వేసి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తామని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు. శుక్రవారం కాంగ్రెస్ బహిరంగ సభ నేపథ్యంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ నేతలు శుక్రవారం కండ్లకోయలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా మైనంపల్లి మాట్లాడుతూ.. మల్లారెడ్డి భూకుంభకోణాలన్నింటికీ తన దగ్గర సాక్ష్యాధారాలు ఉన్నాయని తెలిపారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని బాచుపల్లి, దుండిగల్, కుత్బుల్లాపూర్ మండలాల్లో 1200 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమి కబ్జాకు గురైందన్నారు. ఈ నియోజకవర్గంలో మల్లారెడ్డి మంత్రిగా ఉన్న సమయంలో దాదాపు రూ.25 వేల కోట్లు స్వాహా చేసినట్టు ఆరోపించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం లక్షలాది ఎకరాలను కబ్జా చేసిందని ఆరోపించారు. ఉమ్మడి రాష్ట్రంలో 300 ఎకరాలకు పై చిలుకు స్టేట్ ఫైనాన్స్ కమిషన్‌కు చెందిన భూములు కబ్జాకు గురయ్యాయని తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో 55 వేల ఎకరాల వక్ఫ్‌బోర్డు ల్యాండ్స్ స్వాహా అయ్యాయని ఆరోపించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ భూముల్లో పనులను నిలిపేశామని తెలిపారు. అసైన్డ్ భూములకు బినామీల పేర్ల మీద పాస్ బుక్కులు ఇప్పించారన్నారు.

దుండిగల్ సమీపంలోని దామర చెరువులో దాదాపు ఎనిమిదెకరాల బఫర్ జోన్ భూమి కబ్జా చేసి మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి కాలేజీ నిర్మించారని తెలిపారు. ఈ విషయమై 2011లో బిజెపి, సిపిఐ బిఆర్ఎస్ నాయకులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్టు గుర్తు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో ఇప్పటి ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు కూడా ఉన్నారని తెలిపారు. హైకోర్టు డైరెక్షన్స్ ప్రకారం సర్వే చేసి కలెక్టర్ ఆదేశాలతోనే ఈ అక్రమ నిర్మాణాలను కూల్చేశారని, దీనికి సీఎం రేవంత్‌రెడ్డికి, కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి సంబంధమూ లేదని చెప్పారు. దుండిగల్ మున్సిపల్ కమిషనర్ కేసీఆర్ బంధువని, స్థానిక తహసీల్దార్‌కు మాజీ మంత్రి మల్లారెడ్డి సపోర్టు ఉండటంతో ఇద్దరూ తొత్తులుగా మారి ఈ భూకబ్జాలకు సహకరించారని ఆరోపించారు. దొంగచాటున కలిసే నాయకులు ఎన్ని ప్రయత్నాలు చేసినా పార్టీలో చేర్చుకోబోమన్నారు. మాజీ సిఎం కెసిఆర్ అండదండలతో మల్లారెడ్డి ప్రయివేటు యూనివర్సిటీ తీసుకొచ్చి రిజర్వేషన్లను రద్దు చేసి బిసి, ఎస్‌సి, ఎస్‌టిలకు అన్యాయం చేశారన్నారు. తిరుమలగిరిలోని పురాతన ఆలయ భూములను మల్లారెడ్డి శిష్యుడు స్వాహా చేసే ప్రయత్నం చేశారని తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ.. బహిరంగ సభలో తమ 90 రోజుల పరిపాలన గురించి వివరిస్తామన్నారు. సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు హరివర్ధన్‌రెడ్డి, మేడ్చల్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ కంటెస్టెడ్ ఎమ్మెల్యేలు తోటకూర వజ్రేష్‌యాదవ్, బండి రమేష్, కొలను హనుమంత్‌రెడ్డి, టిపిసిసి నాయకులు నర్సారెడ్డి తదితరులు ఉన్నారు.